క్లుప్తంగా

రేషన్ డీలర్ల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానం

వినుకొండ (నూజెండ్ల): వినుకొండ మండలంలోని పలు రేషన్ షాపులకు డీలర్ల నియామానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తహసీల్దార్ సురేష్ నాయక్ తెలిపారు. రేషన్ షాపు డీలర్లు మరణించడం, రేషన్‌షాపులను విభజించుట వలన ఏర్పడిన ఖాళీలను శాశ్వత ప్రాతిపదికన నియామకం చేయడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. డిసెంబరు 4వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు అర్హత గల అభ్యర్థులు నరసరావుపేట రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలన్నారు.

దరఖాస్తు చేసుకోండి

శావల్యాపురం: మండలంలోని వేల్పూరు షాపు నంబరు-9, చినకంచర్ల షాపు నంబరు-14 శాశ్వత రేషన్ డీలర్లు నియమాకం చేసుకునేందుకు ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు అందినట్లు తహసీల్దారు కె.సుజాత సోమవారం తెలిపారు. ఈసందర్భంగా మాట్లాడుతూ రెండు రేషన్ డీలర్లు ఓసీ జనరల్ దరఖాస్తు చేసుకోవచ్చునని, నరసరావుపేట ఆర్డీవో కార్యాలయంలో డిసెంబరు 4వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఆటపాటలూ ముఖ్యమే

శావల్యాపురం: నిత్యం పాఠాలతో కుస్తీ పట్టే విద్యార్థులు ఆటపాటలతో ఉల్లాసంగా ఉత్సాహంగా గడపటం అభినందనీయమని ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య అన్నారు. సోమవారం స్థానిక శ్రీరామా పబ్లిక్ స్కూలు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్తిక వనభోజనాలు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ప్రాథమిక దశ నుంచి విద్యార్థులకు సాంస్కృతి సంప్రదాయాలు పట్ల అవగాహన పెంపొందించటానికి కార్తిక మాస వేడుకలు ఎంతో దోహదపడతాయన్నారు.

పేర్లు నమోదు చేసుకోండి

శావల్యాపురం: రైతుసేవా కేంద్రాల్లో వరి పంట అమ్ముకునే రైతులు తమ పేర్లు నమోదు చేసుకోవాలని ఏడీఏ బోయపాటి రవిబాబు సోమవారం తెలిపారు. ఈసందర్భంగా ఏడీఏ రవిబాబు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు వరి పంట సాగు చేసిన రైతులు ఈ-పంట నమోదు చేసుకున్న రైతులు 2024-25 ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వ మద్దతూ వరి సాధారణ రకం క్వింటా ధర రూ. 2300, వరి ఏగ్రేడ్ రకం క్వింటా మద్దతూ ధర 2320 రూపాయలు కొనుగోలు చేయటానికి ప్రభుత్వం నుంచి ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.

నేడు గణపవరంలో వేలం

నాదెండ్ల: రెవె న్యూ రికవరీ యాక్ట్‌లో భాగంగా మేజర్ పంచాయతీ గణపవరం పరిధిలో 9 సెంట్ల భూమిని 1వ సచివాలయంలో మంగళవారం బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ ఏవీ రమణ తెలిపారు. ఆసక్తి గల వారు వేలంలో పాల్గొనాలని కోరారు.

వేళకు హాజరు తప్పనిసరి

బొల్లాపల్లి: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్లో ప్రధానోపాధ్యాయుల సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఎంఈవో -1 సయ్యద్ జఫ్రుల్లా మాట్లాడుతూ ఉపాధ్యాయులు నిర్ణీత వ్యవధిలో ముఖ ఆధారిత హాజరు వేయాలన్నారు. పాఠశాలల్లో విద్యార్థుల హాజరు ఆన్‌లైన్ తప్పనిసరి అన్నారు. రికార్డుల్లో పేరు ఉండి పాఠశాలకు హాజరుకాని విద్యార్థులను పరిగణలోకి తీసుకోవద్దని తెలిపారు. హాజరుపట్టికలో పేరు ఉండి భౌతికంగా క్లాసులకు హాజరయ్యే విద్యార్థులను మాత్రమే పరిగణలోకి తీసుకోవాలన్నారు. డిసెంబరు 7న మెగా పేరంట్స్, టీచర్స్ సమావేశం నిర్వహించాలని సూచించారు. సమావేశంలో ఎంఈవో -2 కె.పార్వతి, ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చివరి క్వింటా వరకు కొనాల్సిందే

చిలకలూరిపేట(యడ్లపాడు): సీసీఐ పత్తి కొనుగోలు విషయంలో కేంద్రంపై తెచ్చిన ఒత్తిడి ఫలించిందని చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు చెప్పారు. యడ్లపాడు మండలం తిమ్మాపురం తిరుమల కాటన్ మిల్లులోని సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. ఇప్పటికే కాటన్ మిల్లులు దెబ్బతిన్నాయని, పత్తికి మద్దతు ధర ఇవ్వకుంటే భవిష్యత్‌లో పత్తిసాగుపై రైతుకు ఆసక్తి సన్నగిల్లుతుందన్నారు. ఈ నేపథ్యంలో సీసీఐ చివరి క్వింటా వరకు పత్తిని కొనుగోలు చేసి ఆదుకోవాలన్నారు.

యువకుడి దుర్మరణం

నాదెండ్ల: నిర్మాణంలో ఉన్న వంతెనపై నుండి ద్విచక్రవాహనంతో క్రిందపడి యువకుడు మృత్యువాత పాలయ్యాడు. గణపవరం గ్రామానికి చెందిన జంపని ప్రసాద్ (38) బాపట్ల జిల్లా చీరాలలోని ఓ ప్రైవేటు కళాశాలలో పనిచేస్తుంటాడు. గతంలో ఆయన సివిల్ కాంట్రాక్టర్ వద్ద పనిచేస్తూ ఇటీవల కళాశాలలో ఉద్యోగంలో చేరాడు. ఆదివారం రాత్రి 8 గంటల సమయంలో చీరాల నుంచి గణపవరంకు బైక్‌పై బయలు దేరాడు. పర్చూరు సమీపానికి వచ్చే సరికి నిర్మాణంలో ఉన్న ఫ్లై ఓవర్ మీదకు వెళ్ళాడు. సగం వరకు నిర్మించిన వంతెన పై నుండి ద్విచక్రవాహనంతో సహా క్రింద పడ్డాడు. సోమవారం ఉదయం అటుగా వెళ్తున్న స్థానికులు ప్రమాదాన్ని గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు.

కుయ్యో..మొర్రో!!



కోటయ్యా.. ఇవేం బస్సులయ్యా!

- నీ దర్శనం చేసుకునేది ఎలాగయ్యా?
- కొటప్పకొండ మార్గంలో పల్లెవెలుగు బస్సులు!
- పరిమితికి మించి ప్రయాణికులతో ప్రయాణం
- మధ్యలో మొరాయిస్తున్న ఆర్టీసీ బస్సులు
- భక్తులకు తీవ్ర ఇబ్బందులు


బస్సు ఎక్కేందుకు పోటీపడుతున్న మహిళలు


కొండ దిగువన నిలిచిపోయిన ఆర్టీసీ బస్సు

నరసరావుపేట రూరల్: పవిత్ర కార్తికమాసంలో ప్రముఖ శైవక్షేత్రం కోటప్పకొండకు వస్తున్న యాత్రికులకు ఆర్టీసీ బస్సులు చుక్కలు చూపిస్తున్నాయి. ప్రయాణికులను కొండమీద ఆలయప్రాంగణానికి చేరవేయడంలో ఆర్టీసీకి ఒక ప్రణాళిక లేకపోవడంతో యాత్రికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఫిట్‌నెస్ లేని పల్లెవెలుగు బస్సులను ఘాట్‌రోడ్డులో ఆర్టీసీ వినియోగిస్తోంది. ఘాట్‌రోడ్డు మార్గమధ్యలో ఈ బస్సులు నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కార్తికమాసంలో కోటప్పకొండకు వచ్చే యాత్రికుల కోసం ఏపీఎస్‌ఆర్టీసీ నరసరావుపేట డిపో ఈ సర్వీసులను ఏర్పాటు చేసింది. నరసరావుపేట నుంచి నేరుగా కోటప్పకొండ మీదకు యాత్రికులను చేరవేసే విధంగా బస్సులను ఏర్పాటు చేశారు. సాధారణ రోజుల్లో నామమాత్ర బస్సు సర్వీసులను ఆర్టీసీ నడుపుతుంది. ఆదివారం, సోమవారంతో ప్రత్యేక పర్వదినాల్లో ప్రత్యేక సర్వీసులను ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకు వస్తున్నారు.

ఘాట్‌లో ఫిట్‌నెస్ లేని బస్సులు?

కోటప్పకొండకు ఏర్పాటు చేసిన ప్రత్యేక సర్వీసుల కోసం పల్లెవెలుగు బస్సులను ఆర్టీసీ వినియోగిస్తోంది. ఈనెల 24 ఆదివారం, 25 సోమవారం కోటప్పకొండకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. వీరిని కొండ మీదకు తరలించే క్రమంలో పలుచోట్ల బస్సులు బ్రేక్ డౌన్ అయ్యాయి. ఘాట్‌రోడ్డు మార్గమధ్యంలో బస్సులు అకస్మాత్తుగా నిలిచిపోవడంతో ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. బస్సు నుంచి దిగి కాలి నడకన కొండమీదకు యాత్రికులు చేరుకున్నరు. రెండురోజుల్లో మూడు బస్సులు ఇలానే నిలిచిపోయాయి. మలుపులు ఎక్కువగా ఉండే ఘాట్‌రోడ్డులో ఫిట్‌నెస్ లేని బస్సులను వినియోగించడంపై భక్తుల నుంచి విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. బస్సులు నామమాత్రంగా ఉండటం, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించడమే కారణంగా తెలుస్తోంది.


ఘాట్‌రోడ్డులో నిలిచిన బస్సు నుంచి బయటకు వచ్చిన యాత్రికులు

కిక్కిరిసిన బస్సుల్లో ప్రయాణం

కొండమీద యాత్రికుల రద్దీతో పార్కింగ్‌స్థలం వాహనాలతో నిండిపోయిన సమయంలో ఘాట్‌రోడ్డు నుంచి ప్రైవేటు వాహనాలను పోలీసులు నియంత్రిస్తున్నారు. టోల్‌గేటు వద్ద ప్రైవేటు వాహనాలను నిలిపివేసి పార్కింగ్ స్థలానికి మళ్లిస్తున్నారు. ప్రైవేటు వాహనాల్లో వచ్చిన వారు టోల్‌గేటు నుంచి కొండమీదకు వెళ్లేందుకు ఆర్టీసీ బస్సుల మీద ఆధారపడాల్సి వచ్చింది. బస్సులు అందుబాటులో లేకపోవడంతో యాత్రికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అప్పుడప్పుడు వచ్చే బస్సులో ఎక్కేందుకు యాత్రికులు తీవ్రంగా శ్రమించాల్సి వస్తుంది. మహిళలు, వృద్ధులు సైతం తోపులాటలు దాటుకుని బస్సు ఎక్కాల్సిన పరిస్థితి నెలకొంది. సీటు లేకున్నా అవస్థలు పడుతూ నిలబడి కొండమీదకు చేరుకుంటున్నారు.


టోల్‌గేట్ వద్ద బస్సుల కోసం వేచిఉన్న యాత్రికులు

ఓవర్ లోడింగ్ వల్లే..

నరసరావుపేట నుంచి 18 బస్సు సర్వీసులను కోటప్పకొండకు ఏర్పాటు చేశాం. ఫిట్‌నెస్ ఉన్న బస్సులనే ఘాట్‌రోడ్డులో వినియోగిస్తున్నాం. రద్దీ వలన సాధారణం కన్నా రెట్టింపు ప్రయాణికులు బస్సుల్లో ఎక్కుతున్నారు. దీనివల్ల బస్సులు ఘాట్‌రోడ్డులో మొరాయిస్తున్నాయి. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నాం.

–జీవీఎస్ఎస్ మూర్తి, ఆర్టీసీ డిపో మేనేజర్

ఘనంగా ఉరుసు వేడుకలు

శావల్యాపురం: మండల కేంద్రంలో వేంచేసియున్న అయ్యన్న తాత ఉరుసు వేడుకలు గ్రామస్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో సోమవారం జరుపుకున్నారు. పూరిమెట్ల వంశీకులు సారథ్యంలో నిర్వహించే ఈ ఉరుసు వేడుకలు గత 100 సంవత్సరాల నుంచి నిర్వహించటం ఆనవాయితీగా వస్తుందని గ్రామస్తులు తెలిపారు. ఈసందర్భంగా గ్రామంలోని మహిళలు అయ్యన్నతాత సమాధిని దర్శించుకోవటం పాటు ప్రాంగణంలో పొంగళ్లు పొంగించి పసుపు, కుంకుమ కొబ్బరికాయలు కొట్టి తమ మొక్కులు తీర్చుకున్నారు.

జిల్లా సమాఖ్య ఉపాధ్యక్షురాలిగా భారతి

శావల్యాపురం: స్థానిక మండల సమాఖ్యా అధ్యక్షురాలిగా ఉన్న గోనుగుంట్ల భారతి (కృష్ణాపురం) పల్నాడు జిల్లా సమాఖ్య ఉపాధ్యక్షురాలుగా ఎంపికైనట్లు ఏపీయం జి.వాసుబాబు సోమవారం తెలిపారు. ఈసందర్భంగా మాట్లాడుతూ స్థానిక మండల సమాఖ్యా సెక్రటరీగా వేగుళ్ళ కుమారిని జనరల్‌బాడీ సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. నూతనంగా పదవీ బాధ్యతలు స్వీకరించిన ఇరువురు మాట్లాడుతూ స్వయం సహాయక సంఘలూ బలోపేతానికి జీవనోపాదుల పెంపుదలకు కృషి చేస్తామన్నారు.

ఘనంగా ఎంవీ రెడ్డి కంటి వైద్యశాల ప్రారంభం


హాస్పిటల్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి, డాక్టర్లు


కొబ్బరికాయకొట్టి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ

ప్రముఖ డాక్టర్లు హాజరు

నరసరావుపేట: సత్తెనపల్లిరోడ్డులోని ఆవుల సత్రం వద్ద డాక్టర్ ఎం.వివేకానందరెడ్డి, డాక్టర్ సృజన దంపతులచే నూతనంగా నిర్మించిన ఎంవీ రెడ్డి కంటి వైద్యశాలను ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. డాక్టర్ అరవిందబాబు హాస్పిటల్‌ను ప్రారంభించి హాస్పిటల్‌లోని కళ్లజోడు షాపులో కళ్ళజోడు కొనుగోలు చేశారు. డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి హాజరై మాట్లాడుతూ నరసరావుపేటలో మొట్టమొదటిసారిగా కార్పొరేట్ అంగులతో ఏర్పడిన హాస్పిటల్ అని, మా ప్రియ మిత్రుడు వివేకానందరెడ్డి అద్భుతమైన వైద్యసేవలు చేయగలరని అన్నారు. డాక్టర్ సృజన నరసరావుపేటలో ఆక్యులోప్లాస్టి సర్జరీ చేయడంలో మంచి దిట్టని కొనియాడారు. డాక్టర్ కడియాల లక్ష్మి, డాక్టర్ కడియాల వెంకటేశ్వరరావు పాల్గొని మాట్లాడుతూ పల్నాడు జిల్లాలో మెరుగైన వైద్యసేవలు అందజేయటంలో డాక్టర్లు సుప్రసిద్ధులని కొనియాడారు. ఐఎంఎ మాజీ అధ్యక్షులు డాక్టర్ ఏఏవీ. రామలింగారెడ్డి, డాక్టర్ గజ్జల బ్రహ్మారెడ్డి, ఐఎంఏ సెక్రటరీ డాక్టర్ పాలూరి శ్రీనివాసరెడ్డి, డాక్టర్ కారసాని శ్రీనివాసరెడ్డి, డాక్టర్ జగన్‌మోహన్‌రెడ్డి, సయ్యద్ జిలాని, కపిలవాయి విజయ కుమార్, డాక్టర్ జహీర్ అబ్బాస్ పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణ అందరి బాధ్యత

- అందరూ భాగస్వాములు కావాలి
- టూటౌన్ సీఐ హైమారావు పిలుపు
- ట్రాఫిక్ నియంత్రణపై అవగాహన ర్యాలీ


ర్యాలీ నిర్వహిస్తున్న సీఐ హైమారావు

నరసరావుపేటటౌన్: రోడ్డు ప్రమాదాల నివారణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని టూటౌన్ సీఐ హైమారావు పిలుపునిచ్చారు. ట్రాఫిక్, పట్టణ పోలీస్ శాఖల ఆధ్వర్యంలో సోమవారం ట్రాఫిక్ నియంత్రణపై నిర్వహించిన అవగాహన ర్యాలీ నుద్దేశించి మాట్లాడారు. దేశవ్యాప్తంగా రోజు రోజుకు చోటుచేసుకుంటున్న రోడ్డు ప్రమాదాలను దృష్టిలో ఉంచుకొని ప్రజలు నిబంధనలు పాటించాలన్నారు. ముఖ్యంగా మద్యం సేవించి వాహనాలు నడపడం, అతి వేగం, సెల్‌ఫోన్ డ్రైవింగ్ కారణంగా ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయన్నారు. ప్రమాదాల్లో అనేక మంది మృత్యువాత పడుతుండగా, మరి కొంత మంది తీవ్ర గాయాలై అంగవైకల్యం చెందుతున్నారన్నారు. విషయాలను గుర్తెరిగి తల్లిదండ్రులు పిల్లలకు వాహనాలు ఇవ్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ట్రాఫిక్ సీఐ లోకనాథం మాట్లాడుతూ పట్టణంలో ట్రాఫిక్ సమస్య జఠిలంగా ఉందన్నారు. దుకాణదారులు రోడ్లను అక్రమించి వ్యాపారాలు కొనసాగిస్తున్నారన్నారు. అదే విధంగా ఆయా దుకాణాలకు వచ్చిన వాహనదారులు పార్కింగ్ ప్రదేశాల్లో వాహనాలు నిలపకుండా రోడ్లపై నిలుపుతున్నారన్నారు.

ఆరుగురు జూదరుల అరెస్టు

నాదెండ్ల: పేకాట స్థావరంపై పోలీసులు ఆదివారం దాడి చేసి ఆరుగురు జూదరులను అదుపులోకి తీసుకున్నారు. ఎస్సై జి.పుల్లారావు తెలిపిన వివరాల మేరకు అప్పాపురం గ్రామంలోని చెరువు సమీపంలోని వాటర్ ట్యాంక్ వద్ద గుట్టుచప్పుడు కాకుండా పేకాటాడుతున్నారన్న సమాచారంతో పోలీసులు దాడి చేశారు. పేకాటాడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద రూ.4700లు నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

సంక్షిప్త వార్తలు

■ మరమ్మతులు చేసి దారి కల్పించండి

నరసరావుపేట: ఎన్‌ఎస్పీ కాలువలకు మరమ్మతులు చేసి రైతులు కాలువపై తిరిగేందుకు దారి ఏర్పాటు చేయాలని ప్రజాసంఘాల నాయకులు సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేసి గ్రీవెన్స్‌లో జేసీ సూరజ్ గనోరేకు వినతిపత్రం అందజేశారు. దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం (పీడీఎం) రాష్ట్ర నాయకుడు వై.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వినుకొండ మండలం బ్రాహ్మణపల్లి నుండి విటంరాజుపల్లి సాయిబాబా గుడి పక్కన నంచి రైలు గేటు అవతల వాగు వరకు ఉన్న కాలువ గత కొన్నేళ్ల నుంచి ఎలాంటి మరమ్మతులకు నోచుకోక కుదించకపోయి, చెట్లు, ముళ్ళ కంపలు పెరిగి అడవిలా తయారైందన్నారు. రైతులు తమ పొలాలకు నీళ్లు పెట్టుకోవడానికి కాలువ వెంట వెళ్లడానికి దారి కూడా లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాష్ట్ర నాయకులు నల్లపాటి రామారావు, జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ, జిల్లా అధ్యక్షులు షేక్ మస్తాన్‌వలి, బీసీ నాయకులు బాదుగున్నల శ్రీనివాసరావు, పి.రత్తయ్య, ఏపీ గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వి. కోటనాయక్ పాల్గొన్నారు.

■ తిరుమల విద్యార్థులకు బహుమతులు

నరసరావుపేట రూరల్: సౌత్ ఇండియా మార్షల్ ఆర్ట్స్ చాంపియన్ షిప్ పోటీలలో తిరుమల ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటి బహుమతులు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వై.వి.నారాయణ సోమవారం తెలిపారు. నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన పోటీలలో కళాశాల విద్యార్థులు పి.యేసు మరియమ్మ, జి.కపిల్‌కుమార్, డి.నటరాజ్‌లు యోగా పోటీలలో పాల్గొని ప్రథమ స్థానం సాధించినట్లు తెలిపారు. బహుమతులు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపల్‌తో పాటు యోగ శిక్షకురాలు రంగలక్ష్మి, అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

■ దీక్షాధారులకు సద్ది వితరణ

యడ్లపాడు: స్థానిక కారుచోల మార్గంలోని విశ్వనాథ కండిక కొండపై కొలువై ఉన్న శ్రీకాశీ అన్నపూర్ణదేవి సమేత విశ్వేశ్వరస్వామి ఆలయంలో అయ్యప్ప దీక్షాదారులకు సద్ది వితరణ కార్యక్రమం సోమవారం జరిగింది. ప్రతిరోజు ఒకదాత చొప్పున కార్తిక మాసం ప్రారంభం నుంచి ఇక్కడ మధ్యాహ్నం సద్ది కార్యక్రమం అందిస్తున్నారు.

■ విగ్రహ పరిసరాలు బాగుచేయాలి

యడ్లపాడు: స్థానిక జాతీయ రహదారి పక్కనే ఉన్న రాజీవ్‌గాంధీ విగ్రహం పరిసరాల్లో పరిశుభ్రత వాతావరణం కల్పించాలంటూ కాంగ్రెస్‌పార్టీ నాయకులు పంచాయతీ అధికారులను కోరారు. సోమవారం గ్రామ పంచాయతీ కార్యదర్శి శశికళను కలిసి ఆపార్టీ అధ్యక్షుడు ఎస్ మల్లికార్జునరావు ఆధ్వర్యంలో వినతిని సమర్పించారు.

■ వినుకొండలో భారీ అన్న సంతర్పణ

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని కొత్తపేట సురేష్‌మహాల్ రోడ్డు నందు గల కాశీవిశ్వేశ్వర ఆలయంలో కార్తిక వన సమారాధనలో భాగంగా మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సర్వ కుల, సర్వ మత సహపంక్తి భోజన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు పాల్గొని ప్రారంభించారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర నాయకులు ముప్పాళ్ల నాగేశ్వరరావు, పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతివరప్రసాద్, సీనియర్ న్యాయవాది సీహెచ్ మూర్తి పాల్గొన్నారు.

■ విద్యార్థులకు అవగాహన సదస్సు

శావల్యాపురం: మండలంలోని పోట్లూరు గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులచే మరుగుదొడ్లు అవశ్యకతపై ర్యాలీ కార్యక్రమం ప్రతిజ్ఞ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సింగంశెట్టి అన్నపూర్ణమ్మ పాల్గొని మాట్లాడుతూ ఆరుబయట మలవిసర్జన చేయటం వలన అంటువ్యాధులు ప్రబలుతాయన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బోడ్డపాటి యాకోబు, మండల కో ఆర్డినేటరు కోటేశ్వరరావు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

■ ఘనంగా కార్తిక ఆఖరి సోమవారం

రొంపిచర్ల: కార్తిక మాసంలో ఆఖరి సోమవారం అవ్వడం వల్ల దేవాలయాలన్ని తెల్లవారు జామునుండే భక్తులతో కిక్కిరిసాయి. తెల్లవారుజామునే భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి దీపారాధన కార్యక్రమాలు నిర్వహించారు. ప్రత్యేక అలంకరణలో ఆయా దేవాలయాల్లోని దేవతా మూర్తులు భక్తులకు దర్శనమిచ్చారు. విప్పర్ల లో వేంచేసి ఉన్న శ్రీ గంగాపార్వతీ సమేత వల్లభేశ్వరి స్వామి ఆలయంలో శివలింగాకారంలో ఏర్పాటు చేసిన దీపోత్సవ కార్యక్రమం భక్తులను ఆకట్టుకుంది. వడ్లమూడివారిపాలెంలో వేంచేసి ఉన్న శ్రీ గంగాపార్వతీ సమేత నీలకంఠేశ్వరస్వామి ఆలయం, రొంపిచర్ల శ్రీ బాలత్రిపుర సుందరీ సమేత శంకరస్వామి ఆలయాల్లో కూడా దీపోత్సవం నిర్వహించారు.

■ 29న సీఆర్ కళాశాలలో జాబ్‌మేళా

నాదెండ్ల: గణపవరం చుండి రంగనాయకులు కళాశాలలో ఈనెల 29న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు వైస్ ప్రిన్సిపల్ సీహెచ్ చైతన్య తెలిపారు. ఉదయం 9 - సాయంత్రం 4 గంటల వరకూ డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్, రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జాబ్ మేళాకు నాలుగు కంపెనీలు తరలిరానున్నట్లు తెలిపారు. మాస్టర్ మైండ్స్, రుద్ర కార్పొరేట్ సరీ్వసెస్, సింధుజ మైక్రో క్రెడిట్, కపిస్టన్ సర్వీసెస్ కంపెనీల నుంచి ప్రతినిధులు హాజరై ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, బీటెక్, డిప్లమా, ఫార్మసీ, పీజీ వంటి అర్హతను బట్టి రూ.12 వేల నుంచి రూ.40 వేల వరకూ వేతనం అందిస్తారన్నారు. 18-50 ఏళ్ళలోపు నిరుద్యోగులైన యువతీ యువకులు బయో డేటా, సర్టిఫికెట్లతో హాజరుకావాలని కోరారు.

■ ప్రారంభమైన క్రిస్మస్ మాస వేడుకలు

నాదెండ్ల: ప్రపంచ వ్యాప్తంగా క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో జరుపుకునే క్రిస్మస్ మాసం ప్రారంభమైంది. మండల కేంద్రమైన నాదెండ్లలోని చైతన్యనగర్ క్రీస్తు లూథరన్ దేవాలయంలో క్రిస్మస్ మాస వేడుకలు ప్రారంభించారు. ఫాస్టర్ బి.మోహనరావు, సంఘ నాయకులు పాల్గొని ఉదయం 4 గంటల నుంచి 6 గంటల వరకూ క్యాండిల్‌లు వెలిగించి ప్రార్థనలు చేశారు. క్రిస్మస్ కేక్ కట్ చేశారు.

■ పార్లమెంటులో ఈవీఎంలు వద్దని పోరాడండి

నరసరావుపేట: న్యూఢిల్లీలో జరుగుతున్న పార్లమెంటు సమావేశాల్లో ఈవీఎంలపై గళమెత్తాలని సోమవారం హైదరాబాదులో ఎంపీ అసదుద్దీన్ ఒవైసీని కలిసి కోరినట్లు పట్టణ ఎంఐఎం అధ్యక్షులు షేక్ మౌలాలి పేర్కొన్నారు. ఇక దేశంలో ప్రతి ఎలక్షన్ బ్యాలేట్ ద్వారా ఓటింగ్ జరపాలనీ దీనికోసం పార్లమెంట్‌లో పోరాడాలని కోరామన్నారు.

కార్తిక మాసం.. ఆఖరి సోమవారం


విప్పర్లలో భక్తులు ఏర్పాటు చేసిన దీపోత్సవం


విప్పర్లలో వల్లభేశ్వరస్వామి


రెడ్డినగర్ దీపోత్సవంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి


గణపవరంలో జరిగిన వనసమారాధనలో పాల్గొన్న ఆర్యవైశ్యులు